క్లుప్తంగా

అభినందనలు..



మనోహర్‌కు స్వీట్ తినిపిస్తున్న ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: ఇటీవల విడుదలైన గ్రూప్ – 1 ఫలితాలలో ఆర్టీఓగా ఎంపికైన గోపిశెట్టి మనోహర్‌ను ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర అభినందించారు. ఉప ముఖ్యమంత్రిని ఆయన స్వగృహంలో మనోహర్ బుధవారం మార్యదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మనోహర్‌కు మంత్రి రాజన్నదొర స్వీట్ తినిపించి, అభినందనలు తెలియజేశారు.

వైద్య శిబిరం విజయవంతం



హెల్త్ ఫైల్ అందజేస్తున్న వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, దండి అనంతకుమారి, తదితరులు

సాలూరు: మండలంలోని మావుడిలో సర్పంచ్ పీడిక రాజన్నదొర అధ్యక్షతన బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం విజయవంతమైంది. శిబిరాన్ని వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, ఏఎంసీ చైర్‌పర్సన్ దండి అనంత కుమారి, తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వైద్యులనే ఇంటి వద్దకు పంపించి సేవలందిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపడీఓ పార్వతి, ప్రజాప్రతినిధులు, నాయకులు, వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దుర్గమ్మ నిమజ్జనం



వేగావతి నదిలో దుర్గమ్మ విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న దృశ్యం

సాలూరు: పట్టణంలోని కామాక్షమ్మ ఆలయంలో ఏర్పాటు చేసిన దుర్గమ్మను బుధవారం భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. శరన్నవరాత్రులు పూర్తవడంతో అమ్మవారిని నిమజ్జనం చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మెసేజ్ ద్వారా ఈ పంట నమోదు వివరాలు




మాట్లాడుతున్న ఏఓ ఎస్.అవినాష్

సీతానగరం: మండలంలో ఈ పంటనమోదు చేసిన జాబితాలను సామాజిక తనిఖీ చేసిన అనంతరం రైతు భరోసా, పంచాయతీ ఆఫీసుల వద్ద వివరాలను తెలియ జేయడం, మొబైల్ మెసేజ్‌ల ద్వారా రైతులకు తెలియజేస్తామని ఏఓ ఎస్.అవినాష్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ రైతులు తమ పంట పొలాల్లో సాగు చేసిన పంటలపై వ్యవసాయ సహాయకులతో ఈ పంట నమోదు చేసినట్లు చెప్పారు. గ్రామాల్లో ఈపంట సామాజిక తనిఖీకోసం వస్తున్న సిబ్బందికి రైతులు సహకరించాలని కోరారు.

అంతర్‌జిల్లా బ్యాడ్మింటన్ విజేత ఆమదాలవలస

సీతంపేట: దోనుబాయిలో శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన అంతర్ జిల్లా బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతగా ఆమదాలవలస జట్టు నిలిచింది. దోనుబాయి ద్వితీయ, కొత్తూరు తృతీయ స్థానంలో నిలిచాయి. వీరికి షీల్డుతో పాటు రూ.6 వేలు, 4 వేలు, 3 వేలు నగదు బహుమతులు సర్పంచ్ వెంకునాయుడు అందజేశారు. న్యాయ నిర్ణేతగా ఉపాధ్యాయుడు నిమ్మక సంగమేషు వ్యవహరించారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సర్వేశ్వరరావు

పాలకొండ: స్థానిక అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో పట్టణంలోని యూనియన్ బ్యాంకులో అగ్ని ప్రమాదాల నివారణపై బుధవారం అవగాహన కల్పించారు. బ్యాంకుల్లో అగ్నిప్రమాదం జరిగితే దాని తీవ్రతను తగ్గించే విధానం తెలియజేశారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ జి.శ్రీకాంత్, సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణులకు జగనన్న ఆరోగ్య రక్ష

- గ్రామాల్లో చేరువైన వైద్యసేవలు
- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



సీతానగరం : వృద్ధులకు మందుల కిట్‌లు అంద జేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం / పార్వతీపురంటౌన్: రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా గ్రామీణ ప్రజలకు ఉచితవైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ ఎన్వీరమణ, సర్పంచ్ సీహెచ్ కృష్ణల ఆధ్వర్యంలో మండలంలోని లచ్చయ్యపేటలో సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ ఉషారాణి పర్యవేక్షణలో స్పెషలిస్ట్ డాక్టర్లతో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్యసురక్ష ఉచితవైద్య శిబిరంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు పాల్గొన్నారు. 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్య క్రమం ద్వారా ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు, వైద్య పరీక్షలతో పాటు అక్కడ ఏర్పాట్లను పరిశీలించారు.డాక్టర్లు అందిస్తున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. రోగులు, వృద్ధులు, దివ్యాంగులకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా కుర్చీలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వృద్ధులు, దివ్యాంగులను ప్రత్యేకంగా కలుసుకుని వారి సమస్యలను తెలుసుకుని పూర్తి వైద్య సహాయసహకారాలు అందేలా చూడాలని వైద్యులు, ఆరోగ్య సిబ్బందిని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం. బాబ్జీ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, మండల సీనియర్ నాయకుడు బి. శ్రీరాములునాయుడు, ఎంపీటీసీ సింహాచలం, డీసీసీబీ డైరెక్టర్ కృష్ణం నాయుడు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.తిరుపతి



పార్వతీపురం టౌన్ ఆరోగ్య సురక్ష శిబిరంలో ఎమ్మెల్యే

రావు, పలుగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, పీఏసీఎస్ చైర్మన్లు, కార్యకర్తలు, ఏఓ ఎస్.అవినాష్, ఈఓపీ ఆర్డీ కె.కుమార వర్మ, వైద్యులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు. అలాగే పార్వతీపురం మండలంలోని గంగాపురం గ్రామ సచివాలయం పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే జోగారావు పాల్గొన్నారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, పరీక్షలతో పాటు అక్కడ ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శోభారాణి, వైస్ ఎంపీపీలు సిద్దా జగన్నాథరావు, బంకురు రవికుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, ఆత్మ చైర్మన్ యాండ్రాపు తిరుపతిరావు, తహసీల్దార్ శివన్నారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ వైద్య అధికారులు, వైద్యులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రహదారి ఏర్పాటుకు భూసేకరణపై దృష్టి



భూ సేకరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మండలం అడ్డాపుశీల పంచాయతీ పరిధిలో గల కోటవానివలస గ్రామానికి రహదారి నిర్మాణానికి భూసేకరణపై ఎమ్మెల్యే అలజంగి జోగారావు దృష్టి సారించారు. ఈ మేరకు బుధవారం ఆయన వైఎస్సార్‌సీపీ మండల నాయకులతో కలిసి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రహదారి నిర్మాణానికి కావాల్సిన స్థలాన్ని గుర్తించి ప్రభుత్వం తరపున ఆర్థిక పరిహారం సర్దుబాటు చేయనున్నట్లు ప్రైవేట్ స్థలం యజమానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ప్రతినిధులు, నాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని నోంద్రుకోన పంచాయతీ కీసరగూడ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించేందుకు కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి కీసర గ్రామంలో బుధవారం భూమి పూజ చేశారు. ఈ మేరకు కీసర నుంచి కీసరగూడ గ్రామానికి గల 1.3 కిలోమీటర్లలో బీటీ రోడ్డు నిర్మాణానికి ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.1.30 కోట్లు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రాధాన్యతా క్రమంలో గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. రోడ్డు నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేసి ఈ ప్రాంత గిరిజన ప్రజలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని గిరిజన సంక్షేమ ఇంజినీరింగు శాఖ అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. ఎమ్మెల్యే చొరవతో ఎట్టకేలకు రోడ్డు నిర్మాణం జరుగుతుండటంతో కీసరగూడ గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కుంబురుక దీనమయ్య, జెడ్పీటీసీ మండంగి రాధిక, వైస్ ఎంపీపీ నిమ్మక శేఖర్, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు, నోంద్రుకోన సర్పంచ్ పి.ముసురు, వైఎస్సార్ సీపీ నాయకులు తిరుపతిరావు, మాజీ ఎంపీటీసీ పసుపురెడ్డి మహేష్ తదితరులు పాల్గొన్నారు.



కీసరగూడ గ్రామానికి రోడ్డు నిర్మాణం కోసం భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

మంచి దిగుబడులు సాధించాలి

- ఏపీసీఎన్‌ఎఫ్ డీపీఎం

గుమ్మలక్ష్మీపురం: తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ దిగుబడులు వచ్చే పంటలు సాగు చేసి మంచి ఆదాయం పొందాలని ఏపీసీఎన్‌ఎఫ్ డీపీఎం పి.షన్ముఖరాజు అన్నారు. మండలంలోని దిగువమండ గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పెండల్స్ మోడల్‌లో సాగు చేస్తున్న తీగజాతి పంటలను బుధవారం ఆయన పరిశీలించారు. పందిళ్లు వేసి చిక్కుడు, ఆనప, బీర, కాకర, దొండ మొదలగు తీగజాతి మొక్కలను వేసుకోవడం వలన తక్కువ విస్తీర్ణంలోనే తక్కువ శ్రమతో అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. తద్వారా ఆదాయం అధికంగా పొందవచ్చని, ఈ విధానాల ద్వారా కూరగాయాల సాగు చేసుకునేందుకు రైతులు ముందుకు రావాలని సూచించారు. అనంతరం ఆ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, ఎంపీపీ పాఠశాల ఆవరణల్లో సాగు చేస్తున్న పెరటితోటల పంటలను కూడా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఏపీసీఎన్‌ఎఫ్ మండల ఇన్‌చార్జి ఎం.సీతారాం, రైతులు పాల్గొన్నారు.



దిగువ మండలో తీగజాతి పంటలను పరిశీలిస్తున్న డీపీఎం

డ్యాన్స్ రాజా డ్యాన్స్ విజేత సామరెల్లి

సీతంపేట: దోనుబాయిలో వేంచేసి ఉన్న దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన డ్యాన్స్ రాజా డ్యాన్స్ పోటీల్లో విజేతగా సామరెల్లి టీం నిలిచింది. మొండెంఖల్ ద్వితీయ స్థానం, పొల్ల తృతీయ స్థానంలో నిలిచాయి. నాలుగో స్థానంలో చాపరాయిగూడ, ఐదో స్థానంలో వీఎస్‌జీ టీం నిలిచాయి. ఆల్ ద బెస్ట్ ఫెర్‌ఫార్మెన్స్‌గా దోనుబాయి ఆనంద్ టీం నిలిచింది. వీరికి వరుసగా రూ.15 వేలు, 10 వేలు, 7 వేలు, 5 వేలు, 3 వేలు, వెయ్యి బహుమతులుగా అందజేశారు. విజేతలకు స్థానిక సర్పంచ్ కె.వెంకునాయుడు చేతుల మీదుగా నగదు బహుమతులు అందజేశారు. ఈ పోటీలకు జడ్జీగా స్థానిక ఉపాధ్యాయుడు నిమ్మక సంగమేషు, యాంకర్‌గా వ్యాయామ ఉపాధ్యాయులు రవి వ్యవహరించారు.



డ్యాన్స్ రాజా డ్యాన్స్ విజేతలు

ప్రజల రక్షణ పోలీసుల బాధ్యత

భామిని: ప్రజాస్వామ్యంలో ప్రజల రక్షణ కోసం ప్రాణాలు అర్పిస్తున్న పోలీస్ అమరవీరుల త్యాగాలను మరువ కూడదని బత్తిలి ఎస్‌ఐ యతిరాజుల అమ్మనరావు అన్నారు. భామిని ఏపీ మోడల్ స్కూల్‌లో పోలీస్ అమర వీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల ప్రాణాలకు రక్షణగా అమరులైన పోలీసులకు సంతాపం వ్యక్తం చేశారు. పోలీసులంటే ప్రజల రక్షకులుగా గుర్తించాలన్నారు. మహిళా పోలీస్ చందన పట్నాయిక్, బోధనా సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థుల వ్యాసరచన పోటీలను పర్యవేక్షిస్తున్న ఎస్‌ఐ

నేడు జగనన్న కాలనీలో నిర్మాణాల ప్రారంభం

వీరఘట్టం: మండలంలోని విక్రమపురం గ్రామంలో జగనన్న గృహ నిర్మాణ పథకంలో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో గురువారం ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించనున్నట్లు హౌసింగ్ ఏఈ వినోద్ బుధవారం తెలిపారు. మండల వ్యాప్తంగా 17 లేఅవుట్లలో 795 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను మంజూరు చేయడం జరిగిందన్నారు. వీటిలో చిదిమి, వండవ, పనసనందివాడ, పెద్ద గదబవలస, సంత–నర్సిపురం, రేగులపాడు, తలవరం గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో ప్రస్తుతం 90 ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు ప్రభుత్వం ఇస్తోందన్నారు. వీటిలో రూ.25 వేల విలువ గల సిమెంటు, మిగిలిన మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో వేస్తున్నామన్నారు. మిగిలిన గ్రామాల్లో కూడా జగనన్న హౌసింగ్ కాలనీల్లో నిర్మాణాలు వేగవంతంగా చేపట్టాలన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించడమే లక్ష్యం



రికార్డులు పరిశీలిస్తున్న డీపీఓ నిర్మలాదేవి

రాజాం సిటీ: ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని డీపీఓ నిర్మలాదేవి అన్నారు. మండలంలోని సోపేరు గ్రామ సచివాలయాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. వివిధ పనులపై సచివాయానికి వచ్చేందుకు ఎన్నో వ్యయప్రయాసలు పడాల్సి వస్తోందని సోపేరు సచివాలయం పరిధిలోని నందబలగ, కొఠారిపురం గ్రామస్తులు ఇటీవల నిర్వహించిన స్పందనలో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టేందుకు వచ్చిన డీపీఓ ఆయా గ్రామాల ప్రజలతో సమావేశమై గ్రామస్తుల అభిప్రాయాలు సేకరించారు. సచివాలయ సిబ్బంది ఒక్కో గ్రామంలో రెండు రోజుల చొప్పున అందుబాటులో ఉండేలా చూడాలని వారంతా కోరారు. దీనిపై స్పందించిన డీపీఓ ప్రజాభిప్రాయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. అనంతరం సచివాలయ రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎంపీడీఓ బాసూరి శంకరరావు, ఈఓపీఆర్డీ వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

28న మండల సమావేశం

బాడంగి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 28న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఆంజనేయులు బుధవారం తెలిపారు. ఎంపీపీ భోగి గౌరి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, జెడ్పీటీసీ పెద్దింటి రామారావు గౌరవ సభ్యులుగా పాల్గొంటారన్నారు. మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధశాఖల అధికారులు తప్పకుండా హాజరుకావాలని కోరారు.

నేడు బాడంగిలో జగనన్న ఆరోగ్య సురక్ష

బాడంగి: మండల కేంద్రమైన బాడంగిలో హైస్కూల్ వద్ద గురువారం ఉదయం 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, వాడాడ పీహెచ్‌సీ వైద్యాధికారి ఆదిత్య బుధవారం తెలిపారు. నిపుణులైన వైద్యులు ఈ శిబిరంలో పాల్గొని రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు.

తహసీల్దార్‌గా సులోచన రాణి

రామభద్రపురం: మండల తహసీల్దార్‌గా ఎ.సులోచన రాణి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతవరకు తహసీల్దార్‌గా పనిచేసిన ఎస్.రాజారావుకు వేరే ప్రాంతానికి బదిలీ కావడంతో సంతకవిటి మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన సులోచన రాణి బదిలీపై ఇక్కడకు వచ్చారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఆమె మాట్లాడుతూ మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు కృషిచేస్తానన్నారు.

అయోడైజ్డ్ ఉప్పు వినియోగం మంచిది

- డీఐఓ జగన్మోహనరావు



అజ్జాడలో టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఐఓ

బలిజిపేట: అయోడిన్ లోపంతో కలిగే వ్యాధుల నివారణకు అయోడైజ్డ్ ఉప్పునే వినియోగించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) జగన్మోహనరావు తెలిపారు. ఈ మేరకు మండలంలోని అజ్జాడలో చిన్నారులకు టీకా వేసే కార్యక్రమాన్ని ఆయన బుధవారం పర్యవేక్షించారు. అయోడిన్ లోపంతో వ్యాధులు సంక్రమిస్తున్నాయని, అందుకు తగిన ఉప్పును వినియోగించాలని సూచించారు. అయోడిన్ లోపిస్తే పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రభావం ఉంటుందని, మనోవికాసం లోపించి, బుద్ధి మాంద్యం కలిగి ఉంటారన్నారు. టీకా కార్యక్రమాన్ని పరిశీలించి సిబ్బంది టీకా వేస్తున్న తీరును గమనించి కొన్ని సూచనలు చేశారు. పిల్లల ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొందరి ఇళ్లలో ఉప్పును సేకరించి వైద్య సిబ్బందితో పరీక్ష చేయించారు. కార్యక్రమంలో సిబ్బంది చిన్నమ్మలు, సోనియా, సచివాలయ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నీటిలో కరిగే ఎరువులను పిచికారీ చేసుకోవాలి



బర్లిలో ఎండిపోయిన పంట పొలాన్ని పరిశీలిస్తున్న ఏఓ

బలిజిపేట: తీవ్ర వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ఎండుతున్న పంటకు నీటిలో కరిగే ఎరువులను పిచికారీ చేసుకోవడం మంచిదని ఏఓ శ్రావణ్‌కుమార్ సూచించారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని బర్లి గ్రామంలో ఎండిపోయిన పంటలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షం పడక తేమలేని వరి పంటలో ఎకరాకు 2కిలోల వరకు 19:19:19, 13:0:45 లేదా మల్టీ కే వంటి నీటిలో కరిగే ఎరువులను పిచికారీ చేసుకోవాలని చెప్పారు. లీటరు నీటికి 10గ్రాములు కలిపి 14నుంచి 16ట్యాంకులు పిచికారీ చేయడం వల్ల వారం నుంచి పది రోజుల వరకు తేమ ఉండి మొక్కలు వాడిపోకుండా ఉంటాయన్నారు. ఇప్పటివరకు 182ఎకరాలు పూర్తిగా వాడిపోయినట్లు అంచనా వేశామని తెలిపారు. వర్షాలు కురవకపోతే పంట నష్టం ఎక్కువగా ఉండే అవకాశాలున్నాయని, దీనిపై నివేదిక తయారుచేసి ఉన్నతాధికారులకు పంపనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సహాయకురాలు చాందిని పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా మంజూరు



నగదు అందజేస్తున్న గ్రామ పెద్దలు, పంచాయతీ ఈఓ వెంకటరావు

సీతానగరం: మండలంలోని పెదభోగిలిలో అనారోగ్య కారణాలతో మృతిచెందిన గర్భాపు దాణమ్మకు వైఎస్ఆర్ బీమా పథకం ద్వారా లక్ష రూపాయలు మంజూరైనట్లు పంచాయతీ ఈఓ జె.వెంకటరావు తెలియజేశారు. ఈ మేరకు బుధవారం గ్రామపెద్దల సమక్షంలో దాణమ్మ అంత్యక్రియల నిమిత్తం రూ.10వేలు ఆమె కుటుంబసభ్యులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన గర్భాపు దాణమ్మ అనారోగ్య కారణాలతో ఇటీవల మృతి చెందిందని, ఆమె గతంలో వైఎస్ఆర్ బీమా తీసుకున్నందున రూ.1 లక్ష మంజూరైనట్లు తెలియజేశారు ముందుగా అంత్యక్రియల నిమిత్తం కుటుంబ సభ్యులకు రూ.10 వేలు అంద జేశామని మిగతా రూ.90 వేలు నామినీ బ్యాంక్ ఖాతాలో జమ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వెల్ఫేర్ సహాయకుడు, సచివాలయ కన్వీనర్ కిరణ్‌కుమార్, జె.గరికయ్య, వలంటీర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం భాస్కరరావు, తదితరులు

రామభద్రపురం: అనంతపురం జిల్లా చిగిచెర్లలో ఈ నెల 28, 29, 30 తేదీలలో జరగనున్న రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ జూడో పోటీలకు కొట్టక్కి ఉన్నత పాఠశాల నుంచి 10 మంది విద్యార్థులు ఎంపికైనట్లు వ్యాయామోపాధ్యాయుడు రత్నకిషోర్ బుధవారం తెలిపారు. అండర్–14 విభాగంలో జె.పల్లవి, ఆర్.మౌనిక, ఎస్.ఉమామహేశ్వరరావు, ఎం.కోటేశ్వరరావు, జి.తులసి ఎంపికవగా, అండర్–17 విభాగంలో సీహెచ్ కుసుమ, అండర్–19 విభాగంలో ఎన్.నీలిమ, ఎం.దీపిక, ఎస్.సంధ్య, వి.చంద్రశేఖర్ ఎంపికైనట్లు వెల్లడించారు. వారంతా ఇటీవల ఆరికతోటలో నిర్వహించిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ జూడో పోటీలలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. వారిని జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, సర్పంచ్ అప్పికొండ అనురాధ, హెచ్‌ఎం రావాడ భాస్కరరావు అభినందించారు.

ఉపాధి నిధులతో కందకాల ఏర్పాటు



కందకాలను పరిశీలిస్తున్న ఏపీడీ జనార్దనరావు

బొబ్బిలి: పండ్లతోటలు సాగుచేస్తున్న రైతులు చెట్ల చుట్టూ కందకాలు తవ్వేందుకు ఉపాధిహామీ పథకం కింద పనులు మంజూరు చేస్తామని ఏపీడీ జనార్దనరావు అన్నారు. మండలంలోని కోమటిపల్లి, కింతలివానిపేట తదితర గ్రామాల్లో రింగ్ ట్రెంచ్ తవ్వకాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆసక్తి కలిగిన రైతులు దరఖాస్తు చేసుకుంటే పనులు మంజూరు చేస్తామన్నారు. ప్రస్తుతం గజపతినగరం క్లస్టర్ పరిధిలో రోజుకు 1500 మంది ఉపాధి వేతనదారులు పనులకు వస్తున్నారన్నారు. వ్యవసాయ పనులు ఉండటంతో ఉపాధి పనులకు కొంత ఆటంకం ఏర్పడుతోందన్నారు. అనంతరం మండల పరిషత్‌లోని ఉపాధిహామీ కార్యాలయంలో సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు.

ప్రాధాన్యత పనులు గుర్తించాలి



ఉపాధిహామీ ఎఫ్‌ఏ, టీఏలకు దిశానిర్దేశం చేస్తున్న ఎంపీడీఓ రమామణి, ఏపీఓ హరినాథ్

రామభద్రపురం: రానున్న ఆర్థిక సంవత్సరంలో ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టేందుకు రైతులు, ప్రజలకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీడీఓ రమామణి అన్నారు. ఉపాధి పనుల గుర్తింపు, ప్రాధాన్యత, ప్రణాళికల తయారీపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏపీఓ హరినాథ్‌తో కలిసి బుధవారం ఉపాధి క్షేత్రసహాయకులు, సాంకేతిక సహాయకులకు దిశానిర్దేశం చేశారు. గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజలకు, రైతులకు ఉపయోగపడే పనులు గుర్తించాలన్నారు. ప్రధాన్యత క్రమంలో పనులు చేపట్టేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలన్నారు. రైతుల భూముల్లో రాతి కట్టల నిర్మాణం, మట్టి తొలగింపు, భూమిని చదును చేయడం, పండ్ల తోటల్లో కందకాల ఏర్పాటు, పండ్లతోటల సాగు, వ్యవసాయ బావుల నిర్మాణం, ఫారం పాండ్స్ ఏర్పాటు తదితర పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణాలకు ప్రణాళికలు తయారు చేయాలన్నారు.